

ఏకాభిప్రాయం కుదరక..

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం పోతునాయుడు పేటలో టీడీపీలోని ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరక సాగునీటి సంఘం ఎన్నిక వాయిదా పడింది. శనివారం ఆకాశలక్కవరం ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో 12 మంది టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానం కోసం ఇజ్జువరం మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యనారాయణ, సుగ్గు రమేష్, సీలాపు యుగంధర్ పోటీ పడ్డారు. మండల టీడీపీ నాయకులు సర్దిచెప్పడంతో రమేష్ పోటీ నుంచి తప్పుకుని యుగంధర్‌కు మద్దతు ఇచ్చారు. బొడ్డేపల్లి సత్యనారాయణకు, యుగంధర్‌కు చెరో ఆరుగురు టీసీలు మద్దతు పలికారు. అయితే అధ్యక్ష స్థానం కోసం ఇరువర్గాలు బెట్టు వీడలేదు. సత్యనారాయణ వర్గం టీసీలు కేంద్రం నుంచి ఇంటికి వెళ్లిపోయారు. కోరం చాలక పోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి నర్సింగరావు ప్రకటించారు.



నరసన్నపేట : కోమర్తిలో ఓటింగ్ కోసం బారులుదీరిన రైతులు

ప్రశాంతంగా..

- సాగునీటి సంఘాల ఎన్నికలు
- రెండుచోట్ల మినహా అంతటా ఏకగ్రీవమే
- జిల్లావ్యాప్తంగా 22 ప్రాదేశిక స్థానాల ఎన్నిక వాయిదా

జిల్లాలో రెండు.. మూడు చోట్ల మినహా సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా ముగిసింది. అత్యధికంగా నీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. కూటమి పార్టీల మద్దతు అభ్యర్థులే ఏకపక్షంగా విజయం సాధించారు. కాగా.. కొన్నిచోట్ల స్వల్ప వివాదాలు.. మరికొన్నిచోట్ల కోరం లేకపోవడం తదితర కారణాలతో 22 ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు వాయిదా వేశారు.

శ్రీకాకుళం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 344 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా.. రెండుచోట్ల మినహా.. మిగతా అన్నిచోట్ల ప్రశాంతంగా ప్రక్రియ ముగిసింది. అంతటా కూటమి మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్నిచోట్ల ప్రాదేశికస్థానాల విషయంలో తెలుగుదేశం, జనసేన మద్దతుదారుల మధ్య కాస్త పోటీ వాతావరణం ఏర్పడింది. మరికొన్ని చోట్ల స్వల్ప వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

2628 'ప్రాదేశిక' స్థానాలకు..

జిల్లాలో బీఆర్ఆర్ వంశధార, నారాయణపురం ఆనకట్ట, అలాగే మైనర్ ఇరిగేషన్ కింద మొత్తం 2,628 నీటి సంఘాల ప్రాదేశిక స్థానాలకుగాను శనివారం ఎన్నికలు జరిగాయి. ఇందులో 2,606 స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. పలు కారణాలతో ఇంకా 22 ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. గెలుపొందినవారికి సంబంధిత అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎన్నికల ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పర్యవేక్షించారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ముగ్గురు ఆర్డీఓలు శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రక్రియను అంతటా పరిశీలిస్తూ.. సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేశారు. అలానే వంశధార, జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తిచేశారు.

ఏకగ్రీవంగా..

- రణస్థలం మండలంలో 8, మెళియాపుట్టి మండలంలో 17 నీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి.
- పోలాకి మండలంలో ఆరు నీటి సంఘాలకు ఏకగ్రీవమయ్యాయి. టీడీపీ మద్దతుదారులే గెలుపొందారు.
- సంతబొమ్మాళి మండలంలో పది, నందిగాం మండలంలో నాలుగు మేజర్, తొమ్మిది మైనర్ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.
- సారవకోటలో ఒక మేజర్ నీటి

(మిగతా 6వ పేజీలో..)

పోతయ్యవలస, కంబకాయి టీసీల ఎన్నికలు వాయిదా

నరసన్నపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలో ఆరు నీటిసంఘాల పరిధిలో 72 టీసీలకు శనివారం ఎన్నికలు జరగ్గా.. 69 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. పోతయ్యవలస, కంబకాయి, గోపాలపెంటలో మాత్రమే వైసీపీ మద్దతుదారులు బరిలో నిలిచారు. ఈ మూడుచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమం లో కంబకాయి, పోతయ్యవలసలో టీసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. కోమర్తి పాఠశాలలో నిర్వహించిన పోతయ్యవలస టీసీ ఎన్నికలకు సంబంధించి ఇరు పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎన్నికల అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. పోతయ్యవలస టీసీ ఎన్నిక వాయిదా వేసినట్లు ప్రకటించారు. అలాగే ఉర్లాం పాఠశాలలో కంబకాయి రెండో టీసీకి నిర్వహించిన ఎన్నిక కూడా.. ఇరుపార్టీల మధ్య వాగ్వాదం కారణంగా వాయిదా వేశారు. ఈ ఎన్నికల్లో మహిళా రైతులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.



నరసన్నపేట : కోమర్తిలో ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

పోలీసు బందోస్తు మధ్య రీ కౌంటింగ్

జి.సిగడాం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం నిద్దాం సాగునీటి సంఘం ఎన్నిక వివాదాల నడుమ రసవత్తరంగా సాగింది. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, జి.సిగడాం, ఎచ్చెర్ల ఎస్ఐలు వై మధుసూదనరావు, చిరంజీవి, ఏఆర్ పోలీసుల బందోస్తు నడుమ రీ కౌంటింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచీ ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ ప్రక్రియ ఉదయం 9.15 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండగా.. ఒక వర్గం సమయానికి నామినేషన్ దాఖలు చేసింది. రెండో వర్గం 10 గంటలకు నాటమినేషన్ దాఖలు చేయటంతో వాగ్వాదం మొదలైంది. అది చినుకుచినుకు గాలివానలా మారి రాత్రి వరకు ఉత్కంఠ రేపింది. ఓటు వేయడానికి కొంతమంది క్యూ పాటించకుండా వెళ్లడంతో వివాదం నెలకొంది. పోలింగ్ సిబ్బంది నామినేషన్ల విషయంలో సమయపాలన పాటించలేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవరించారని పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

- ఇదిలా ఉండగా పోలింగ్ అధికారులు చెప్పిన వివరాలు ప్రకారం 10వ ప్రాదేశికానికి సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లో 81 ఓట్లు పడ్డాయి. వీటిని లెక్కించగా టీడీపీ వర్గానికి 44 ఓట్లు, జనసేన వర్గానికి 37 ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిజిస్టర్‌లో మాత్రం 75 ఓట్లుగా గా పోలింగ్ అధికారులు నమోదు చేశారు. బ్యాలెట్ బాక్స్‌కి, రికార్డుకి ఆరు ఓట్లు తేడా రావటం వివాదానికి దారితీసింది. ముందుగా పోలింగ్ కేంద్రంలో గొడవ కారణంగా రికార్డులో నమోదు చేయలేకపోయా మని అధికారులు చెప్పినా.. రీ కౌంటింగ్ చేసినా ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో అధికారులు పదో టీసీ బ్యాలెట్‌లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. రీ కౌంటింగ్ నిర్వహిస్తారా? లేదా ఎన్నిక వాయిదా వేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.



జి.సిగడాం : నిద్దాంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

అవి ఎక్కడున్నాయో?

ఆరోగ్య కేంద్రాలంటే ప్రజలకు అందుబాటులో నెలకొల్పి వారికి ఉచిత సేవలు అందించాలి. కానీ అందుకు విరుద్ధంగా పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటిలో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాల ఉనికి కానీ, సమాచారం కానీ, అసలు అవి ఎక్కడ ఉన్నాయో ఇప్పటి వరకూ తెలియని దుస్థితి నెలకొంది. ఒకవేళ పట్టణ ఆస్పత్రికి వెళ్లినా.. తమకు సక్రమంగా సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులకు.. ఎవరికీ పట్టని విధంగా ఈ ఆరోగ్య కేంద్రాలు తయారయ్యాయని ఆరోపిస్తున్నారు.

- పట్టణ ఆరోగ్య కేంద్రాల దుస్థితి ఇదీ
- అధికారులు, ప్రజాప్రతినిధులకూ సమాచారమేదీ?
- పలాస-కాశీబుగ్గలో సక్రమంగా అందని సేవలు

పలాస, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణ దయనీయంగా మారింది. 2019 సంవత్సరానికి ముందు ప్రతి మునిసిపాలిటిలో ప్రైవేటు భాగస్వామ్యంతో పట్టణ ఆరోగ్య కేంద్రం ఒకటి ఉండేది. విశ్రాంత వైద్యాధికారుల నిర్వహణలో దీన్ని నిర్వహించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటు భాగస్వామ్యాన్ని తొలగించి.. నేరుగా వైద్యారోగ్యశాఖ ద్వారా వీటి పనులు ప్రారంభించారు. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పట్టణ ఆరోగ్య కేంద్రాలకు చేరుకొని వైద్యం పొందేలా పథక రచన చేశారు. ప్రతి 25వేల జనాభాకు ఒక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆ దిశగా ఆదరబాదరగా ఆరోగ్య కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగించారు. అప్పట్లోనే ఈ వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపింది.

- పాలకవర్గానికి తెలియకుండానే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని ఉదయపురం, శివాజీనగర్, నర్సిపురం ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఒక వైద్యుడితో పాటు సిబ్బంది నిర్ణీత పనివేళల్లో ప్రజలకు సేవలు అందించాలి. రోగులను ప్రాణాపాయ స్థితినుంచి రక్షించడంతో పాటు జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు ఏరియా ఆసుపత్రులకు వెళ్లకుండా పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా చికిత్స పొందవచ్చు. గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధకటీకాలు ఈ కేంద్రాల ద్వారే వే స్తుంటారు. హెచ్‌బీ, బీపీ, షుగర్, మలేరియా వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఇక్కడే చేయాలి. అంతా బాగానే ఉన్నా అసలు ఈ ఆరోగ్య కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రాల వద్ద కనీసం బోర్డులు కూడా సక్రమంగా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ కొంతమంది ఆరోగ్య కేంద్రాలకు వెళ్లినా.. అక్కడ సక్రమంగా వైద్యసేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్న ఒక్క వైద్యుడు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు రారో తెలియడం లేదని

(మిగతా 6వ పేజీలో..)



ఉదయపురంలో కనీసం బోర్డు కూడా కనిపించని పట్టణ ఆరోగ్య కేంద్రం

సమాచారం లేదు

పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఎందుకు ఆపేసారో మా వద్ద సమాచారం లేదు. దీనిపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరణ తీసుకుంటాం. రాష్ట్రంలో అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల బిల్లులు చెల్లించారు. ఇక్కడ పరిస్థితి వేరుగా ఉంది. అవి ఎక్కడ ఉన్నాయో, వైద్యాధికారుల విధులు ఏమిటో కూడా తెలియదు. వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్న కారణంగా మునిసిపాలిటీకి సమాచారం ఇవ్వడం లేదు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను గాడిలో పెట్టడానికి చర్యలు తీసుకుంటాం.

- ఎన్.రామారావు, మున్సిపల్ కమిషనర్, పలాస-కాశీబుగ్గ



బిల్లులు చెల్లించక.. తాళాలు వేసిన మొగిలిపాడు పట్టణ ఆరోగ్య కేంద్రం

ఆ నిందితుడు ఎక్కడ?

- రాష్ట్రవ్యాప్తంగా దొంగనోట్ల చెలామణి లింకులు
- రాజమహేంద్రవరానికి సిక్కోలు పోలీసులు
- ఒకరిని పట్టుకుని వస్తుండగా ముఠా దాడి
- తప్పించుకుని పరారీ.. పోలీసుల గాలింపు

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొంగనోట్ల చెలామణి లింకులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు శ్రీకాకుళం పోలీసులు గుర్తించారు. జి.సిగడాంలో రూ.15 లక్షల నకిలీ నోట్లతో దొరికిన ఎన్ని రాజేష్, గనగళ్ల రవికుమార్‌ను విచారించగా.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో దీని మూలాలు ఉన్నట్లు కనుగొన్నారు. దీంతో లావేరు ఎస్ఐ లక్ష్మణరావుతో పాటు జి.సిగడాం, ఎచ్చెర్ల పోలీసులు విచారణ ప్రారంభించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సమీపాన ఉన్న కొప్పోర్రు గ్రామానికి చెందిన రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్‌రెడ్డి దొంగనోట్ల చెలామణి చేస్తుంటాడు. అతనితో ఎన్ని రాజేష్‌కు సంబంధాలు ఉండటంతో లావేరు ఎస్ఐ తన బృందంతో అక్కడికి వెళ్లారు. ఈ నెల 12న ప్రతాప్‌రెడ్డిని సిక్కోలు పోలీసులు(లావేరు ఎస్ఐ బృందం) రాజమహేంద్రవరంలో పట్టుకున్నారు. అతడిని జిల్లాకు తరలిస్తుండగా దొంగనోట్ల ముఠా పోలీసుల కారును ఆపి దాడి చేసింది. దాడిలో పోలీసులు గాయపడగా కారులో ఉన్న ప్రతాప్‌రెడ్డి పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయాడు. దీంతో లావేరు ఎస్ఐ లక్ష్మణరావు రాజమండ్రిలోని ప్రకాష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రతాప్‌రెడ్డి కోసం వెతుకుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి దొంగనోట్ల ముఠా పట్టుబడుతుండటంతో పాటు వారి నుంచి రూ.లక్షల్లో నకిలీ నోట్లు రికవరీ చేశారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే రూ.20 లక్షలకు పైగా నకిలీనోట్లు పట్టుబడగా రాజోలులలో 12మందిని అక్కడి పోలీసులు పట్టుకోగా వారి నుంచి 500 రూపాయల దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు. మెళియాపుట్టిలో సైతం దొంగ నోట్లతో సంబంధం ఉన్న వారిని రెక్కీ వేసి పట్టుకున్నారు.

జిల్లాలో పాత నేరస్థుల హస్తం

మెళియాపుట్టిలో పట్టుబబడిన వారిలో ఏ-2గా ఉన్న శంకర్ రెడ్డి గతంలో పలాసలో దొంగనోట్ల చెలామణి కేసు నిందితుడు. ఇతడికి జి.సిగడాంలో దొంగనోట్లతో దొరికిన రాజేష్, రవి పరిచయమై తొలుత ఒడిశా నుంచి దొంగనోట్లు తెప్పించారు. తరువాత పశ్చిమగోదావరి జిల్లా కొప్పోర్రు గ్రామానికి చెందిన ప్రతాప్ రెడ్డితో పాటు రాజమండ్రికి చెందిన క్రిష్ణమూర్తితో పరిచయం ఏర్పడింది. తర్వాత అధిక సొమ్ము సంపాదించాలన్న దురాశతో ముద్రణకు కావాల్సిన ప్రింటర్, వాటిలో వాడే ఇంకు సామగ్రిని కొనుగోలు చేసి నకిలీనోట్లు ముద్రించడంపై దృష్టిపెట్టారు. లక్ష రూపాయల అసలు నోట్లు ఇస్తే రూ.5లక్షల నకిలీ నోట్లు మార్చుకునేలా వ్యాపారం సాగించిన రాజేష్, రవికుమార్ జిల్లాలో జరిగే సంతలను టార్గెట్ చేసుకుని నోట్ల మార్పిడి చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దొంగనోట్ల చెలామణిలో పాతపట్నంకు చెందిన వైసీపీ నేత కూడా ఉన్నట్లు గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే జిల్లాలో మరింత మంది దొంగనోట్ల ముఠా సభ్యులు బయటపడే అవకాశం ఉంది.

సమయాన్ని వృథా చేయొద్దు

- లోక్ అదాలత్‌లో 2,894 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

గుజరాతీపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేయొద్దు. పంతాలు, పట్టింపులను వీడి రాజీ పడాలి. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాల'ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. శ్రీకాకుళంలోని జిల్లా న్యాయ స్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. 'జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,894 కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్ కేసులు 138 కాగా, మోటార్ యాక్సిడెంట్‌కు సంబంధించి 43 కేసులు, క్రిమినల్ కేసులు 2,694 కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు 62 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 19 బెంచ్‌ల్లో లోక్ అదాలత్ నిర్వహించాం. లీగల్ సర్వీసులను ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ వారిని, పారా లీగల్ వలంటీర్లను నియమించాం. మూడు నెలల కిందట నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 1700 కేసులు పరిష్కరించామ'ని జిల్లా ప్రధాన న్యాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ఎం.ఫణికుమార్, న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడకు 41ఏ నోటీసులు

టెక్కలి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు పోలీసులు 41ఏ నోటీసులు అందించారు. వైసీపీ హయాంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుర్భాషలాడారు. దీనిపై గతంలో టెక్కలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ దువ్వాడకు 41ఏ నోటీసులు అందజేశామని ఏఎస్ఐ శంకరరావు తెలిపారు.



ప్లీజ్ ఒక్క క్షణం

- క్షణికావేశంతో యువత బలవన్మరణాలు
- చిన్నపాటి బాధను తట్టుకోలేక పోతున్న వైనం
- కౌన్సిలింగ్ అవసరమంటున్న నిపుణులు

6లో

రేపటి నుంచి ధనుర్మాసం

- ఆరాధనకు సిద్ధమైన విష్ణు ఆలయాలు
- 16వ తేదీ తెల్లవారుజామున నెలగంటు

6లో



ప్లీజ్.. ఒక్క క్షణం

కష్టం, నష్టం, ఆక్రోశం, ఆవేదన, ఆందోళన, ఆక్రందన లేనిదెవరికి..? పోటీ ప్రపంచంలో ప్రతిక్షణమూ పోరాటమే. విజయం.. ఈరోజు కాకపోతే రేపు వరిస్తుంది. గెలుపోటములను సమానంగా స్వీకరించాలి. అంతేగానీ జీవితాన్నే అర్ధాంతరంగా ముగిస్తామా? గమ్యాన్ని మధ్యలోనే వదిలేస్తామా? కన్నవారికి కడుపుకోత మిగులుస్తామా? ఇటీవల క్షణికావేశంలో యువతీ యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వారు ఒక్క క్షణం.. ఆగి ఆలోచించి ఉంటే.. తమ వారిని, తమ భవిష్యత్తును తలచుకుని ఉంటే..! ఆ అఘాయిత్యాలకు పాల్పడి ఉండేవారు కాదేమో!

- క్షణికావేశంతో యువత బలవన్మరణాలు
- చిన్నపాటి బాధను తట్టుకోలేక పోతున్న వైనం
- కౌన్సిలింగ్ అవసరమంటున్న నిపుణులు
- పది రోజుల్లో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

ఎచ్చెర్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయమే బలన్మరణం. జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే రెండు. ఒకటి కాలం, రెండోది ప్రాణం. కాలాన్ని కాసేపైనా ఆపడం ఎవరి తరం కాదు. ప్రాణం కూడా ఎంతో విలువైనది. అయితే ప్రాణాన్ని తృణప్రాయంగా తీసుకొనేందుకు కూడా కొంతమంది వెనక్కి తగ్గడంలేదు. ప్రాణం విలువ తెలియకనో.. మరియేతర కారణాల వల్లనో నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. 'కన్ను తెరిస్తే జననం.. కన్ను మూస్తే మరణం.. రెప్పపాటే కదా జీవితం' అంటాడు ఓ సినీ కవి. సహజ మరణానికి ఆపడం ఎవరికీ సాధ్యం కాదు. బలన్మరణాలను ఆపేందుకు కౌన్సెలింగ్ వల్ల సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కాలానికి అనుగుణంగా మారలేకపోవడం, తీవ్రమైన ఒత్తిడి, ఆత్మన్యూనతా భావం తదితర కారణాలు ఆత్మహత్యలు ప్రేరేపిస్తున్నాయని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్షణికావేశం నుంచి ఆలోచనలను కొద్దిసేపు మళ్లించగలిగితే.. ఎప్పుడు అలాంటి ప్రయత్నం జోలికి వెళ్లే అవకాశం ఉండదని అంటున్నారు.

పదిరోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు..

యుక్త వయసులో ఉన్నవారు ఆత్మహత్యలకు ప్రేరేపితులవుతున్నారు. పది రోజుల వ్యవధిలోనే ఎచ్చెర్ల మండలంలో ఇద్దరు విద్యార్థులు బలన్మరణానికి పాల్పడ్డారు. ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి, అలాగే ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకుని కన్నవారికి గుండెకోత మిగిల్చారు. నాలుగైదు నెలల క్రితం ఇదే మండలంలోనే పొన్నాడ, బొంతలకోడూరు గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక మూల ఇలాంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం.



కౌన్సెలింగ్‌తోనే..

కొంతమంది విద్యార్థులు తమకు ఎలాంటి సమస్య వచ్చినా స్నేహితులతో, ఉపాధ్యాయులతో, చివరకు తల్లిదండ్రులు, తోబుట్టినవారితో కూడా చెప్పేందుకు ఇష్టపడరు. ఇలాంటి వారు అంతర్ముఖులు (ఇంట్రోవర్ట్)గా ఉండడం వల్ల సమస్యలను తమ మదిలోనే దాచుకుంటూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ముభావంగా ఉండడం, ఎవరితోనూ కలవడానికి ఇష్టపడకపోవడం, ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తుండడం ఇలా కొంతమంది తమ సమస్యకు పరిష్కారం వెతకకుండానే కుమిలిపోతుంటారు. ఇలాంటి రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నవారికి తరుచుగా కౌన్సెలింగ్ ఇస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. యాంత్రిక జీవితంలో తీవ్రమైన ఒత్తిడి వల్ల కూడా ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఓ సర్వేలో తేలింది. జీవితం పట్ల సానుకూల దృక్పథంతో ఒక్క క్షణం ఆలోచించినా ఆత్మహత్యలను నివారించవచ్చని అంటున్నారు.



కౌన్సిలింగ్‌తో ఏదైనా సాధ్యం

కొంతమంది ప్రతి విషయాన్నీ తీవ్రంగా ఆలోచిస్తుంటారు. వారికి ఎదురైన సమస్యలను ఎవరితోనూ పంచుకునేందుకు ఇష్టపడరు. దీనివల్లనే సమస్యలు ఎదురవుతుంటాయి. చివరికి తల్లిదండ్రులతో కూడా స్వేచ్ఛగా మాట్లాడేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి సమస్యలకు కచ్చితంగా కౌన్సెలింగ్‌తోనే ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు. భవిష్యత్‌పై భరోసా కల్పించేలా కౌన్సెలింగ్ ఇవ్వాలి. నలుగురితో కలిసేందుకు ఇష్టపడకుండా ఒంటరిగా, ముభావంగా ఉండే వ్యక్తుల పట్ల ప్రత్యేక దృష్టిసారించాలి. ముఖ్యంగా పాఠశాలల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన బాధ్యత స్వీకరించాలి. విద్యార్థుల చే స్ఫూర్తినిచ్చే పుస్తకాలను చదివించాలి. విద్యార్థులచే ప్రాణాయామం, యోగాను తప్పనిసరిగా చేయించాలి.

- డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

ప్రవర్తనపై నిఘా పెంచాలి



ఒంటరి కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, తగిన ఆర్థిక వనరులు లేకపోవడం, నిరంతర ఒత్తిడి, సాంఘిక వెనుకబాటుతనం, పోటీ ప్రపంచంలో వెనుకబడిపోవడం, ఆరోగ్య సమస్యలను ప్రధాన కారణంగా గుర్తించాలి. వ్యక్తి ప్రవర్తనలో మార్పు కనపడడం, ఆందోళన, దిగులు చెందడం, ముభావంగా, చిరాకుగా, కన్నీళ్లు ఆపుకోలేకపోవడం, భవిష్యత్‌పై ఆశలేకపోవడంతో ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి ఒంటరిగా ఉంచకుండా నిత్యం తోడుగా ఉండాలి. వారి భావాలను ఖండించకుండా సహానుభూతితో మెలగాలి. సమస్యలు ఉంటే వాటిపై చర్చను వాయిదా వేయాలి. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, నలుగురితో వివాదరహిత విషయాలు చర్చించే దిశగా అడుగులు వేయించడం వంటి చర్యలు అవసరం. అవకాశం ఉంటే వెంటనే మానసిక వైద్యున్ని సంప్రదించడం మంచిది.

- డాక్టర్ ఎన్ఎన్ రాజు, పూర్వ జాతీయ అధ్యక్షుడు, భారత మానసిక వైద్య సంఘం, విశాఖపట్నం



వ్యాయామం తప్పనిసరి

ప్రతి పాఠశాలలో క్రీడా మైదానం తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులకు వ్యాయామం, ఆటలు ఆడించాలి. అలాగే గ్రంథాలయాన్ని విద్యార్థులు ఎక్కువగా వినియోగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకోవాలి. వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. విద్యా బోధనతో పాటు అదనపు పాఠ్య కార్యకలాపాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి. ఎప్పటికప్పుడు విద్యార్థులను చైతన్యపర్చేందుకు కౌన్సెలింగ్ తరగతులను నిర్వహించాలి. ముఖ్యంగా బాలిక గురుకుల పాఠశాలల్లో ప్రత్యేకంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై కూడా అవగాహన కల్పించాలి. మెరుగైన బోధనతో పాటు విద్యార్థులకు భవితపై బంగారు ఆశలు కలిగేలా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుండాలి.



పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

- ఉపాధి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలి
- వ్యర్థాలతో ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి
- మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

రణస్థలం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చిన్న మధ్యతరహా పరిశ్రమలు మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎన్ఆర్ఐ సాధికారిక శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావ అన్నారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, గ్రామాల అభివృద్ధి పరిశ్రమ యాజమాన్యాలు సహకరించాలని కోరారు. శనివారం పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ శిక్షణ కేంద్రంలో పలు పరిశ్రమల యాజమాన్యాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. తొలత పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలని అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారంపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 విజన్ ప్రకారం కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పైడిభీమవారం పారిశ్రామికవాడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ భూగర్భజలాలు తక్కువగా ఉన్నాయని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. వ్యర్థ జలాల నిర్వహణ కోసం చిన్న పరిశ్రమలన్నీ కలసి ముందుకొస్తే కేంద్రం మంజూరు చేసే 70 శాతం గ్రాంట్‌తో ట్రీట్మెంట్ ప్లాంట్‌ను నెలకొల్పవచ్చన్నారు. వ్యర్థ జలాలను శుద్ధ జలాలుగా మార్చి అవసరాలకు వినియోగించుకోవచ్చని, ఆ దిశగా పరిశ్రమలు ప్రయత్నించాలని కోరారు. ప్రస్తుతం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి దొరుకుతోందని, ఆ సంఖ్యను 50 వేలకు పెంచేందుకు విధంగా కృషి చేస్తామని తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థాలతో ఈ ప్రాంతం కలుతమవుతోందన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంతో నమ్మకంతో ప్రజలు పరిశ్రమలకు భూములు ఇచ్చారని, అవసరమైన శిక్షణ ఇప్పించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

పరిశ్రమల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి పలువురు తీసుకెళ్లగా వాటిని దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు, ఉన్న పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామని, స్థానిక నిరుద్యోగ యవతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం మాధవి, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

రేపటి నుంచి ధనుర్మాసం

- ఆరాధనకు సిద్ధమైన విష్ణు ఆలయాలు
- 16న ఉదయం 6.38 గంటలకు నెలగంటు

నరసన్నపేట/టెక్కలి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విష్ణుమూర్తికి ఇష్టమైన మాసం ధన్ముర్మాసం. విష్ణు ఆలయాల్లో నెలరోజుల పాటు విశేషమైన సేవలు జరిపిస్తారు. దేవతలు కూడా ఈ మాసాన్ని బ్రహ్మముహూర్తంగా భావిస్తారు. సోమవారం ఉదయం 6.38గంటలకు నెలగంటు పెట్టేందుకు బ్రాహ్మణులు నిర్ణయించారు. ఈ మాసంలో మేలుకొలుపులు.. గంటజంగాల పాటలు.. ఇళ్ల ముందు రంగవల్లుల సందడి ఉంటుంది. రైతులకు పంట అందే సమయం కావడంతో.. పంటను పెద్దలకు సమర్పించడం.. ఈనెలలో పితృదేవతలకు జంగదేవరలతో పొగడ్తలు చేయడం ఆనవాయితీ. దేవాలయాల్లో గోదారంగనాథ స్వాములకు కొలవడం నెలంతా జరుగుతుంది. గంగిరెద్దుల ఆటలు.. కోడి పందేలు గ్రామాల్లో కనిపించనున్నాయి. సంక్రాంతి వరకు ఈ వేడుకల ఆనందాయకంగా నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి నాడు మహావిష్ణువుని ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి దర్శిస్తే దేవతలు దీవిస్తారనేది నమ్మకం. ఇంకా ఈ మాసం శూన్యమాసంగా చెప్పవచ్చు. శుభ కార్యక్రమాలు చేయడానికి ఇష్టపడరు. గృహప్రవేశాలు, పెళ్లిల్లు వంటి వాటికి దూరంగా ఉంటారు. నెలగంటు తరువాత ఎవరైనా అత్యవసరంగా కొత్తబట్టలు వాడాలంటే అవి ఆవు వెనుకభాగంలో వేసి ఆ తరువాతనే ధరిస్తారు. నరసన్నపేట పట్టణంలో గీతామందిరం, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాస్థానాల్లో నెలరోజులు పాటు ధనుర్మాస వేడుకుల్లో భాగంగా 30 పాశురాల్లో గోదారంగనాథస్వాములకు పూజలు నిర్వహించనున్నారు.



నరసన్నపేట: దశావతారంలో వేంకటేశ్వరస్వామి

హైజంప్‌లో రాణించిన పారా అథ్లెటిక్

- అంతర్జాతీయ పోటీలో గోల్డ్‌మెడల్
- లోకేష్‌కు గ్రామస్థుల అభినందన

పలాసరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలియో వ్యాధి కారణంగా కుడికాలు నిస్సహాయ స్థితిలో ఉన్నా క్రీడలపై ఉన్న అభిరుచితో పారా అథ్లెటిక్ పోటీ హైజంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి ఔరా అనిపించాడు పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన మంత్ర లోకేష్. నిరుపేద అయిన, పుట్టుకతోనే పోలియో వ్యాధిగ్రస్తుడైన లోకేష్ చిన్నప్పటి నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్నాడు. దీనిని గమనించిన గ్రామంలోని జడ్పీ హైస్కూల్ పీఈటీ కిరణ్ ఆయనకు అథ్లెటిక్స్‌లో శిక్షణనిచ్చాడు. దీంతో పట్టువదలని విక్రమార్కుడిలా గ్రామస్థాయి ఆటల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో హైజంప్ విభాగంలో బంగారు, లాంగ్‌జంప్‌లో రజత పతకాన్ని గెలుచు కొని భారతదేశ జెండాను రెపరెపలాడించాడు. ఈ సందర్భంగా శనివారం లోకేష్ పలాస రైల్వేస్టేషన్‌కు చేరు కోవడంతో గ్రామస్థులతో పాటు సర్పంచ్ శాసనపురి తిరుమలరావు తదితరులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువను కప్పి సత్కరించారు. తాను భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత క్రీడాకా రుడిగా ఎదగడమే లక్ష్యంగా నిరంతర సాధన చేస్తున్నట్లు లోకేష్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.



లోకేష్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

ప్రశాంతంగా..

(ఐదో పేజీ తరువాయి)

సంఘానికి, 12 మైనర్‌నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా.. పది మైనర్ నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైంది. రెండు సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 'సత్రాం' నీటి సంఘం వైసీపీ కైవసం చేసుకుంది.

- కవిటి మండలంలో ఐదు నీటి సంఘాలకు నాలుగు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో రాజపురం నీటి సంఘానికి సభ్యులు ఎవరూ రాకపోవడంలో వాయిదా వేశామని తహసీల్దార్ తెలిపారు.
- సోంపేట మండలంలో 13, మందసలో 11, కంచిలిలో 16 సంఘాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది.
- ఎల్.ఎన్.పేట మండలంలో ఏడు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరగ్గా.. టీడీపీ మద్దతుదారులే గెలుపొందారు.



జి.సిగడాం: నిద్దాంలో పోలీసు బందోబస్తు

ఆర్మీ శిక్షకుడిపై కేసులో
పోలీసులకు కీలక ఆధారాలు!

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఉద్యోగాల శిక్షకుడిపై కేసులో పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమైనట్లు సమాచారం. శిక్షణ పేరుతో వేధించడంతో పాటు డబ్బులు వసూలు చేశారన్న కేసులో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ (ఐఏసీ) నిర్వాహకుడు, శిక్షకుడు బీవీ రమణ అరెస్టు అయిన విషయం విదితమే. ఈ కేసులో డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో రూరల్ సీఐ కె.పైడపునాయుడు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. విజయనగనం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 12 మంది తాము మోసపోయామని కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో బీవీ రమణపై ఒన్‌టౌన్‌లో రెండు కేసులు, రూరల్ పోలీసు స్టేషన్లో మరో రెండు కేసులు నమోదయ్యాయి. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో తనిఖీలు చేసిన పోలీసులకు పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కుల ద్వారా కీలక అధారాలు లభించాయని తెలుస్తోంది. అవి పోలీసుల వద్ద సురక్షితంగా ఉన్నాయో లేదో అన్న అనుమానాలను బాధితులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీవీ రమణపై ఒన్‌టౌన్ ఎస్ఐగా పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. బాధితులు సోమవారం డీఐజీ కార్యాలయానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని కోరనున్నట్లు సమాచారం.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్‌లు

అవి ఎక్కడున్నాయో!

(ఐదో పేజీ తరువాయి)

పలువురు పేర్కొంటున్నారు. ఈ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో, వీటి నిర్వహణ, బాధ్యతలు, సిబ్బంది విధులేమిటో ఇప్పటివరకూ మునిసిపల్ పాలకవర్గానికి కానీ, అధికారులకు కానీ తెలియకపోవడం చర్చనీయాంశంగా మారింది.

భవనాల నిర్మాణం.. అంతే..

ఉదయపురంలో ఓ ఇంటిలో అద్దెభవనంలో, నర్సిపురంలో చాలీచాలని ఇంటిలో, శివాజినగర్‌లో ఎవరికీ కనిపించని విధంగా అద్దె భవనంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలు సమకూర్చేందుకు మూడేళ్ల కిందట అప్పటి ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్నారు. మొగిలిపాడు గ్రామం వద్ద జాతీయరహదారికి ఆనుకొని చెరువు గర్భంలో 40సెంట్లు స్థలంలో, సూదికొండకాలనీ రెల్లివీధి సమీపంలో, కోసంగిపురం ఆఫ్‌షోర్ నిర్వాసితుల కాలనీ వద్ద మూడు ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. ఇందులో మొగిలిపాడు, నిర్వాసితుల కాలనీ వద్ద 80శాతం పనులు పూర్తయ్యాయి. సూదికొండకాలనీ వద్ద 20 శాతం పనులు చేపట్టి.. వదిలేశారు. ఇప్పటివరకూ సంబంధిత కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన బిల్లులు ఎందుకు ఆపారో ఇప్పటివరకూ మునిసిపల్ అధికారుల వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం. ఈ పనులు ఎందుకు ప్రారంభించారు. ఎందుకు విడిచిపెట్టారో అధికారులే సమాధానం ఇవ్వాల్సి ఉంది.



నిర్మాణదశలో ఉన్న సూదికొండ పట్టణ ఆరోగ్య కేంద్రం



శివాజీనగర్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రం

రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలి

● రైల్వే మంత్రిని కోరిన సాధన కమిటీ సభ్యులు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమక్షంలో రైల్వేశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రైలు నిలుపుదల సాధన కమిటీ ప్రతినిధులు

గుజరాతీపేట/సోంపేట,డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):బారువ రైల్వే స్టేషన్ (కొర్లాం)లో రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని రైల్వే నిలుపుదల సాధన కమిటీ ప్రతినిధులు రాంబుడ్డి గణపతి, రత్నాల శ్రీనివాసరావు కోరారు. శనివారం కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌తో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ అయ్యారు. బారువ రైల్వే స్టేషన్ (కొర్లాం)లో రైళ్లను ఆపాలని వినతిపత్రం అందజేశారు. సముద్రం చేపలు పట్టడం, పర్యాటకంపై ఆధారపడిన 40కిపైగా గ్రామాలకు ఈ స్టేషన్ సేవలందిస్తుందని వివరించారు. బారువా ఆర్ఎస్ పర్యాటకు లకు ముఖ్యమైన రైల్వేస్టేషన్‌గా ఉందని తెలిపారు. భువనేశ్వర్ - విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, బర్హంపూర్ -విశాఖ ఇంటర్ సిటీ వంటి కొన్ని రైళ్లు ఆగకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

ఒడియా మాధ్యమం కొనసాగించాలి

● అపోటా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు భాస్కర్‌పాడి, బృందావన్ దొళాయి

కంచిలి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒడియా విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ఒడియా మాధ్యమం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌పాడి, బృందావన్ దొళాయి కోరారు. శనివారం కంచిలి రాధాకృష్ణ దేవాలయంలో అపోటా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ఒడియా మైనార్టీ అసోసియేషన్‌ను విద్యాశాఖ అధికారులు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సమావేశానికి ఆహ్వానించి తమ సమస్యలను తెలియజేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండాఒడియా ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించి అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో అపోటా మండల శాఖ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌పాడి, కార్యదర్శి భగీరథీనాయక్, ఉపాధ్యక్షుడు త్రినాథ్‌సాహు, శరత్ చంద్రబెహరాపాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో పూర్వ విద్యార్థులు

గార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాయూనివర్సిటీలో 1973-76లో న్యాయశాస్త్రం అభ్యసించిన పూర్వవిద్యార్థులు శనివారం శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో కొందరు పలుప్రాంతాల్లో వివిధ శాఖల ఉన్నతాధికారులుగా, న్యాయవాదులుగా, న్యాయాధికారులుగా ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు దేవదాయశాఖలో అదనపు కమిషనర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జీవీ నరసింహమూర్తి దంపతులతోపాటు సుమారు 30 మంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో గురునాధరావు, ప్రధాన అర్చకులు సీతారామనరసింహాచార్యులు స్వాగతం పలికారు.స్వామి వారి చరిత్ర విశిష్టత గురించి అర్చకులు మురళీకృష్ణ వారికి వివరించారు.

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా సూర్యప్రకాష్

ఇచ్ఛాపురం,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురానికి చెందిన కట్టా సూర్య ప్రకాష్ ఖుర్దా డివిజన్‌డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ (డీఆర్‌యూసీసీ) కమిటీ సభ్యుడిగా డీఆర్ఎం నియమించారు. ఖుర్దా డివిజన్ పరిధిలో 2008 నుంచి 2019 వరకు ఐదుసార్లు డీఆర్‌యూసీసీ సభ్యుడిగా నియమితులయ్యారు. పదో జోనల్ రైల్వే యూజర్స్ నన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా 2023-24 నియమితులై సేవలందించారు.

నిత్యాన్నపూర్ణ సేవకు ఆర్థిక సాయం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు సహాయకులకు నిర్వహిస్తున్న నిత్యాన్నపూర్ణ సేవకు పట్టణానికి చెందిన దివంగత డాక్టర్ లోకనాథం సూర్యలింగం కుమారుడు రామారావు రూ. పది వేలు టస్ట్ అధ్యక్షుడు గంగుల రమణ బాబుకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, ట్రస్ట్ సెక్రటరీ కిల్లా ఫల్గుణరావు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు: డీఎస్పీ



మాట్లాడుతున్న వెంకట అప్పారావు

కంచిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోంపేట సీఐ బి.మంగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సారా తయారీ రవాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేయవద్దని, రాజకీయ కక్షలకు పోయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. పోలీసులు సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణా అడ్డుకట్టవేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జనార్దనరావు

గార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు కోరారు. శనివారం సతివాడలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎం మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. వాహన చోదకులు కూడా ఆ వాహనానికి సంబంధించిన అన్ని పేపర్లు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు.

నైపుణ్యంపై దృష్టి సారించాలి

ఆమదాలవలస(బూర్జ), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని పెద్దపేట ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. వృత్తి విద్యనభ్యసించే విద్యార్థులు నైపుణ్యం విషయంలో మరింత దృష్టిసారించాలని కోరారు.శనివారం ఆర్ట్‌సంస్థలో ఆన్‌దిజాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వజూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు ఒకరోజు ఓజేటీ కార్యక్రమం నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు.అనంతరం వ్యవసాయం, వాటి అనుబంధ పంటలు, చిన్న తరహా పరిశ్రమల స్థాపన, చిరుధాన్యాలు, అగ్రికం, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై సంస్థ ఎండీ నూక అనూప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

'డార్క్‌సీన్'కు 139వ ర్యాంకు

నరుబుజ్జిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రచయిత, కవి కుప్పిలి వెంకట రాజారావుకు జాతీయస్థాయి కవిత్వం పోటీ ల్లో ర్యాంక్ లభించింది. నవంబరులో ఎస్-7 పోయెట్రి కాంటెస్ట్‌లో రాజారావు రచించిన డార్క్‌సీన్ కవిత్వానికి 139 ర్యాంకు లభించింది. దేశంలో వెయ్యి మందికిపైగా పాల్గొన్న ఈపోటీల్లో తాను కనబరిచిన సృజనాత్మ కతను ప్రశంసిస్తూ ర్యాంకు ఇవ్వడంతపాటు సర్టిఫికెట్‌ను గూగుల్ నిర్వాహకులు పంపినట్టు రాజారావు తెలిపారు. ఈ మేరకు పలువురు సాహితీ అభిమానులు ఆయన్ను అభినందించారు.

అల్లు అర్జున్ అభిమానుల పూజలు

గుజరాతీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):సినీ హీరో అల్లుఅర్జున్ బెయిల్‌పై విడుదల కావడంతో అభిమానులు హర్షంవ్యక్తం చేశారు. శనివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుక్కల నవీన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్య క్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు నవీన్, గిరి, భాను, రమణారెడ్డి పాల్గొన్నారు.

కాలువలు లేవు.. కనీస వసతులు లేవు

● ఇదీ మెళియాపుట్టి పంచాయతీలో పరిస్థితి



రాజవీధి జంక్షన్‌లో అధ్వానంగా మారిన మురుగుకాలువ

మెళియాపుట్టి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి పంచాయతీలో సమస్యలు తిష్ట వేశాయి. సుమారు ఐదువేల మంది జనాభా ఉన్న ఈ పంచాయతీలో కనీస సౌక ర్యాలు లేవు. దీనికితోడు మురుగునీరు బయ టకు వెళ్లిపోయేలా కాలువలు సైతం ఏర్పాటుచేయలేదు. గ్రామసచివాలయం, రైతు సేవా కేంద్రాల నిర్మాణం కూడా అర్ధాంతరంగా నిలి చిపోయాయి. మూడేళ్ల నుంచి పంచాయతీకి వచ్చి నిధులు వీధి లైట్లు, పారిశుధ్య నిర్వహణకే వెచ్చిస్తున్నట్లు ఖర్చులు చూపిస్తున్నారు తప్పా కాలువలు, సీసీరోడ్లు నిర్మాణం సాగకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు.ప్రధానంగా రాజవీధిజంక్షన్‌లోని కాలు వలు పూర్తిగా పాడయ్యాయి. కనీస మరమ్మతులకు సైతం నోచుకోకపోవడంతో ఎగువప్రాంతం నుంచి వస్తున్న మురుగు నీరు ఇక్కడ నిల్వఉంటుండడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు.ఇక్కడే పోస్టల్ కార్యాలయంతో పాటు ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో చెత్త నిల్వ ఉండడం వల్ల దుర్వాసన భరించలేక పోతున్నామని పలువురు వాపోతున్నారు. కాగా మూడేళ్లుగా మెళియాపుట్టి పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేరు. దీంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది. పలు వీధుల్లో కనీసం వీధి లైట్లు లేకపోయినా బిల్లులు సైతం చేయించుకోలేని పరిస్థితి నెలకొంది.

స్పీడ్‌బ్రేకర్లు లేవు.. హెచ్చరిక బోర్డులు కరువు

● తరచూ ప్రమాదాలు ● ఇదీ మండలంలోని రోడ్డు మలుపుల వద్ద పరిస్థితి



వమరవెల్లి రోడ్డు కూడలి వద్ద ప్రమాదకర మలుపు

గార, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని బందరువానిపేట, కొమరవానిపేట, శ్రీకూర్మం, వాడాడ, బూరవెల్లి తదితర గ్రామాల వద్ద రోడ్డు మలుపుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏ ఒక్క మలుపు దగ్గర కూడా ప్రధానంగా స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయలేదు. రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో చోదకులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగాకళింగపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే వమరవెల్లిరోడ్డు కూడలి, ఉప్పరిపేట కల్వర్టు వద్ద దగ్గర మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.కాగా మండలంలో పలు గ్రామాలకు వెళ్లే దగ్గర మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు, జీబ్రామార్క్‌లు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అంచనాలు తయారుచేసి అధికారుల అనుమతికి పంపించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ గోవిందరావు తెలిపారు.

వినియోగంలో లేక.. విష జంతువులకు నిలయం

● ఇదీ అక్కుపల్లి పీహెచ్‌సీ పాతభవనం వద్ద పరిస్థితి



శిథిలావస్థలో ఉన్న అక్కుపల్లి పీహెచ్‌సీ పాత భవనం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కుపల్లి పీహెచ్‌సీ పాతభవనం ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో విషజంతువులకు నిలయంగా మారింది. దీనికి తోడు భవనం బయటకు బాగానే ఉన్నా లోపలి భాగం శిథిలావస్థకు చేరింది. దీంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉండడంతో తొలగించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కొద్దినెలల కిందట పీహెచ్‌సీ ఆవరణలో నూతన భవనం నిర్మించి, దాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం అక్కడి నుంచే ఆసుపత్రి కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని నిరుపయోగంగా విడిచి పెట్టడంతో భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో పాటు విషజంతవులకు నిలయంగా మారింది. దీంతో ఇటీవల ప్రారంభించిన భవనానికి దీనికి ఆనుకునే ఉండడంతో రోగులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. తక్షణమే శిథిలావస్థకు చేరిన పాత భవానాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వేతనాలు అందక.. కుటుంబ పోషణ జరగక

● ఐదునెలలుగా రూ.1.72 కోట్లు బకాయిపడిన వైనం

● ఇదీ జిల్లాలో ఆయాలు, నైట్ వాచ్‌మన్ల పరిస్థితి

నరసన్నపేట, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వ్యాచ్‌మన్లకు ఐదునెలలు వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. జిల్లాలో 3,046 ప్రభుత్వ పాఠశాలల్లో 2,576మంది ఆయాలు, 296 మంది నైట్ వ్యాచ్‌మన్లకు రూ.1.72 కోట్ల వేతనాల బకాయి చెల్లించాల్సిఉంది.ఈనెల వేతనంతో కలిపి ఒక్కక్కరికి రూ.35వేలు చెల్లించాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి

వైసీపీ ప్రభుత్వ హయంలో ఆయా, నైట్ వ్యాచ్‌మన్లను పోస్టులను భర్తీచేశారు. అప్పట్లో మూడు లేదా ఐదు నెలలకు ఒక్కసారి వేతనాలు చెల్లించేవారు. గత ప్రభుత్వహయంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలను అధికారంలో వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం చెల్లించింది.అయితే జూలై నుంచి వేతనాల చెల్లింపుల్లో తాత్సర్యం జరుగుతోంది.గత ప్రభుత్వంలో మాదిరిగానే తమ వేతనాలు కూటమి ప్రభుత్వం కూడా చెల్లించడంలేదని ఆయాలు వాపోతున్నారు. ఇదే సమయంలో నిత్యావసర సరకుల ధరలు నింగికి తాకడం, వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. సంక్రాంతి నాటికైనా వేతనాలు చెల్లించాలని దేశవానిపేట ఆయా చిన్నమ్ముడు వాపోతోంది. వేతనం అందకపోవడంతో అప్పుచేస్తున్నామని జమ్ము పాఠశాల ఆయా కొయ్యాన శశికళ తెలిపింది.ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండడంతో వేరేపనులకు వెళ్లలేకపోతున్నామని చెప్పింది. కూటమి ప్రభుత్వంలో వేతనాలు ప్రతినెలా చెల్లిస్తారని ఆశపడ్డామని తెలిపింది. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకొస్తామని ఆయాలు ఆందోళన చెందుతున్నారు. కనీసం వచ్చేనెల ఒకటితేదీకైనా చెల్లించాలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆయాలు కీలకం

ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, వాష్ బేసిన్లు శుభ్రంగా ఉంచడంతోపాటు పాఠశాల తెరిచే సమయానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో ఆయాలు కీలక పాత్ర పోషిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత కూడా పాఠశాలలను శుభ్రపరిచి విద్యార్థులకు సేవలందిస్తున్నారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో నైట్‌వాచ్‌మన్లు దొంగతనాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అప్పట్లో నియమించారు.ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు లక్షలు విలువ చేసే ప్యానల్ బోర్డులు, సిస్టమ్స్ అందజేసింది. వీటిని రక్షించే బాధ్యత వీరిపైనేపెట్టింది.జూన్‌వరకు వేతనాలు చెల్లించారని, జూలై నుంచి ప్రభుత్వం వేతనాలు చెల్లించడానికి తాత్సర్యం చేస్తోందని ఆయాలు, నైట్ వాచ్‌మన్లు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మన్ల వేతనాల చెల్లింపునకు ప్రతిపాదనలు పంపించినట్లు నరసన్నపేట ఎంఈవో శాంతారావు తెలిపారు. సర్వశిక్ష అభియాన్‌కు నిధులు వచ్చిన వెంటనే ఆయాలకు చెల్లిస్తామని చెప్పారు.

రాజీయే సరైన మార్గం

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఫరీష్ కుమార్



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఫరీష్ కుమార్

ఇచ్ఛాపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజీయే మార్గమే సరైన మార్గమని మునిసిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫరీష్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 208 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ పి.వరలక్ష్మి, బార్ అధ్యక్షుడు నందికి రమణయ్య, దేవరాజ్‌రెడ్డి, గిన్ని సీతయ్యారెడ్డి, భగవాన్‌దాస్, సత్యనారాయణ, సత్యన్నారాయణ పాడి, మనోజ్, బైరాగిరెడ్డి, రంగారావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

●పొందూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొందూరు కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 218 కేసులు పరిష్కారమైనట్లు స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి. జ్యోత్స్న తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, రమణమూర్తి, బ్రహ్మాజీ, సురేష్, రాము, రామ్మోహన్ పాల్గొన్నారు.

పలాసలో ఉత్తరాంధ్ర భక్తి సమ్మేళనం

పలాస, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర భక్తి సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠ శాల మైదానంలో రెండోరోజు కార్యక్రమానికి రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వసంవేద్యా నందజీ, బేలూరు మఠం పీఠాధిపతి వేదప్రియానందజీ, హృదానందజీతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి సేవా సంఘం నిర్వాహకులు పాల్గొని ఆధ్యా త్మిక ప్రసంగాలు ఇచ్చారు. పలాస నిర్వాహకుడు జీవన్ బెహరా స్వాగతో పన్యా సాన్ని చేశారు. శ్రీరామ కృష్ణ కథా మృత పఠనం, భజన కార్యక్రమాలు జరిగాయి.



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వామీజీ

అమెజాన్ వెబ్ సర్వీస్‌లో ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): టెక్ మహేంద్ర ఫౌండేషన్ వారి డిజిటల్ అకాడమీలో అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ, సర్టిఫికేషన్, ఉద్యోగ వకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మేడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు బీఈ, బీటెక్, బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 76809 45357,79950 13422 సంప్రదించాలన్నారు.

మండపల్లిలో సెమీ క్రిస్మస్ సంబరాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపల్లి ఆంధ్రబాప్టిస్ట్ సంఘంఆధ్వర్యంలో శనివారం సెమీక్రిస్మస్ సంబరాలను జిల్లా కిస్టియన్ మైనార్టీ సంఘ అధ్యక్షుడు అవినాష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పి.ప్రకాశరావు, ప్రత్తి విజయ్‌కుమార్, మాచర్ల తాతాజీబాబు, వి.వెంకటేష్, ఒడియా చర్చిపాదర్ భీమ్‌బెహరా, జాన్‌సన్, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప కన్నెపూజ

ఇచ్ఛాపురం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో ఎస్‌కేఎస్ మూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం 50మంది అయ్యప్ప కన్నెస్వాములు కన్నెపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆరాధన, మెట్లు పూజ నిర్వహించిన అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న దుర్గారావు

గుజరాతీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):ఎస్సీల జీవన విధానం, పరిస్థితులపై పూర్తిస్థాయిలో కులగణన నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల దుర్గారావు తెలిపారు.శనివారం శ్రీకాకుళంలోని ఇలిసిపురంలో గల అంబేడ్కర్ సమావేశ మందిరంలో దళిత మహాసభ దళిత హక్కుల పరిరక్షణ సమితి, మాల ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టులు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న పథకాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గంజి ఆర్. ఎజ్రా, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కోకన్వీనర్ రాంబాబు, ఎ.ప్రతాప్, ఎస్.రమేష్ బాబు పాల్గొన్నారు.

In the court of the Hon'ble III[rd] ADM, kadapa
O.S.No.374/2023.
G.Davendranth Reddy proprietor ALOE VERA AYUR,Enterprises,D/No.20/1151,co-operative colony, kadapa city,and dist.
vs
The proprietor,SRI VARSHINI INDUSTRES,D,B1,16-100-123-15A,Neelamma colony, opp to old coca cola, Depot Road,Srikakulam Dist-532005.
Summon
By order of the court
B.Gurappa Naidu (B.A.B.L.,)
Advocate Kadapa
Cell:9162568496

పబ్లిక్ నోటీస్
సెల్: 9247315759

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532





ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

FINANCIAL SERVICES
Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు నెలవారీ పద్ధతిలో గాని, సులభ వాయిదా పద్ధతిలో గాని 50 వేలు నుండి 5 లక్షలు వరకు ఫైనాన్స్ చేయబడును. Reg.No. 136/2009, Cont: 9am to 8 pm, సెల్: 96665 47338.
AJD:199729

FLATS FOR SALE



సంప్రదించండి 9573992444 9959612342

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029,పలాస: 9985411524
సోంపేట: 9989281099,రాజాం : 9573179776

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

శిథిల వంతెనలు.. ప్రమాద హేతువులు

- పట్టించుకోని వంశధార అధికారులు
- నిత్యం నరకాన్ని అనుభవిస్తున్న ప్రజలు




తామరాపల్లి సమీపంలో శిథిలావస్థలో సింగిల్ వే వంతెన, (ఇన్‌సెట్‌లో) రెయిలింగ్ ఊడిపోయిన దృశ్యం

టెక్కలి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ మొదలు కొని వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి వరకు సుమారు 104.826 కిలో మీటర్ల విస్తీర్ణంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ ప్రవా హం ఉంది. 12 మండలాల పరిధిలోని 398 గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంశ ధార సాగునీటి కాలువలపై సుమారు 60 వంతెనలను 1978లో నిర్మిం చారు. అయితే ఈ వంతెనలు పూర్తిగా శిథిలా వస్థకు చేరుకున్నాయి. కొన్ని వంతెనలు రెయిలింగ్‌లు ఊడిపోగా, కొన్ని రోడ్లు పాడై, వంతెన కింది భాగంలో ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. మరికొన్ని పూర్తిగా ఎప్పు డు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఎదుర వుతోంది. ఏడాది కిందట నంక్రితం నందిగాం మండలం గొల్లూరు సమీ పంలో వంశధార ప్రధాన ఎడమకాలువపై గల సింగిల్‌వే వంతెనపై ఓ ఇసుక టిప్పర్ వెళ్తుండడంతో ఒక్కసారిగా వంతెన కుప్పకూలింది. దీంతో కొన్నాళ్లుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ బొరిగిపేట సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై సింగిల్‌వే వంతెనపై ఏకంగా 40 నుంచి 60 టన్నుల గ్రానైట్ బ్లాకుల వాహనాల రాకపోకలతో ఎప్పుడు కూలి పో తుందో తెలియని పరిస్థితి నెలకొంది. నాలుగు దశాబ్దాల కిందట నిర్మిం చిన తరువాత వంతెనలకు ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఈ వంతెనల దుస్థితిని అధికా రులకు దృష్టికి తీసుకువెళుతున్నా వంశధార అధికారుల్లో చలనం కనిపిం చడం లేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా వంతెన కూలితే అక్కడికి అధికారులు హడావుడిగా రావడం, హామీల్వివ్వడం, ఆ తరువాత వాటి ఊసెత్తక పోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా వంశధార ప్రధాన ఎడమకాలువపై ఉన్న వంతెనలకు మరమ్మతులు చేపట్టడం, కొత్త వంతెలన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా 20 టన్నుల కెపాసిటీ ఉన్న ఈ సింగిల్‌వే వంతెనలను లైట్‌వెయిట్ డిజైన్ చేయడం జరిగిందని, అధిక బరువు కలిగిన వాహనాలు వెళితే ప్రమా దాలు పొంచే అవకాశం ఉందన్నారు.

క్రైం కార్నర్

అన్నదమ్ముల మధ్య భూవివాదం

- తమ్ముడి కుటుంబంపై దాడి
- ముగ్గురికి గాయాలు



ఘటనపై వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రాము

టెక్కలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య భూ వివాదంలో తమ్ముడి కుటుంబంపై అన్న, అతని కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన ఘటన శనివారం ఉద యం తిర్లంగి గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తిర్లంగి గ్రామానికి చెందిన పిట్ట జానకి రామయ్య, రామ్మో హన్ అన్నదమ్ములు. వీరి మధ్య 50 సెంట్ల భూ వివాదం నెలకొంది. తమ్ముడు రామ్మో హన్ సదరు భూమిలో ఈ భూమి కోర్టు పరిధిలో ఉందని బోర్డు ఏర్పాటు చేయడంతో అన్న జానకి రామయ్య, ఆయన కుమారుడు నవ్యకాంత్ ఆగ్రహంతో రామ్మోహన్ నివాసం వద్దకు వెళ్లి ఆయన లేని సమయంలో రామ్మోహన్ భార్య రాజేశ్వరిపై కొడవలితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆమె తల, భుజం, నడుముపై గాయాలయ్యాయి. అదే సమయంలో తమ్ముడు రామ్మోహన్ రావడం తో అన్న దమ్ములు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సోదరులిద్దరూ ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. అయితే రాజేశ్వరికి బలమైన గాయాలు తగలడంతో ఆమె పరి స్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

22 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

మెళియాపుట్టి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి 22 కిలోల గంజా యిని తరలిస్తుండగా నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ రామారావు, ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక మహేంద్రతనయనది వద్ద ఇద్దరు అనుమానితులు రెండు బ్యాగులతో ఉండగా తనిఖీ చేయగా గంజాయి బయటపడిందన్నారు. నిందితులు గజపతి జిల్లా అడవురు గ్రామానికి చెందిన జోషప్‌టీర్, విశాఖపట్నం చెందిన అఫ్రోజ్ అలంగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. 22 కిలోలు గంజాయిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఐ

పాతపట్నం డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొరసవాడ గ్రామంలో అక్రమంగా ఉంచి న మద్యం నిల్వలపై శని వారం పోలీసులు దాడి చే శారు. గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. అనధికారికంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నా, అక్ర మంగా రవాణా చేసినా, విక్రయించినా నేరమన్నారు. ఇటువంటి సమాచారాలు ఏమైనా ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

14 రోజుల్లో 70..

ఇచ్ఛాపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం స్టేషన్ పరిధిలో 14 రోజుల్లో నిర్వహించిన దాడుల్లో 70 మద్యం సీసాలతో పాటు 27 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి తరలిస్తున్న 36 ఒడిశా మద్యం సీసాలు, 34 డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీసాలు, 27 లీటర్ల ఒడిశా సారా, 18.5 కేజీల గంజాయిని, సారా, గంజా యి తరలింపు కేసులో చెరో ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. పాత కేసుల్లో పట్టుబడిన నిందితులకు బైండోవర్ చేసేందుకు ఇచ్ఛా పురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస తహసీల్దార్లకు ప్రతిపాదనలు సమ ర్పించినట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని యువకుడి మృతి



రమేష్ బెహరా (ఫైల్)

కంచిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల లోని కొన్నాయిపుట్టుగ వద్ద శనివారం రాత్రి జ రిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహ రా(25)మృతి చెందాడు. స్థానికులు, కంచిలి పోలీ సుల కథనం మేరకు.. రమేష్ బెహరా శనివారం ఉపవాసం వల్ల గ్రామంలో అల్పాహారం దొరక్కపో వడంతో అల్పాహారం చేసేందుకు తలతంపర వె ళ్లాడు. అక్కడ సైతం అల్పాహారం దొరక్కపోవడంతో మాణిక్యపురం నడుచుకుని వస్తున్నాడు. అదే సమయంలో కొన్నాయిపుట్టుగ మీదుగా భార్యతో కలిసి సోంపేటలోని తన అత్తవారింటి నుంచి బెజ్జిపుట్టుగలోని తన స్వగ్రామానికి వీఆర్వో దివాకర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమ యంలో నడుచుకుని వెళ్తున్న రమేష్ బెహరాను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయంకావడంతో రమేష్ బెహరా అక్కడికక్కడే మృ తిచెందాడు. కొన్నాయిపుట్టుగకు చెందిన శాంతి బెహరాతో ఎనిమిది నెలల కింద ట వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. కాగా రమేష్ బెహ రాకు సోదరుడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. కంచిలి ఎస్ఐ పి.పారి నాయుడు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హరిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల- రంగోయి గేటు మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మఖరజోలకు చెంది న బమ్మిడి కూర్మారావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి.. రంగోయి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బాధితుడికి రెండు కాళ్లు విరిగిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విష మంగా మారడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తర లించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో ప్రయోజనం




పలాస, నరసన్నపేటలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారులు మాధురి, హరిప్రియ

జాతీయ లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు ప్రయోజనం ఉంటుందని న్యాయాధికా రులు అన్నారు. ఈ మేరకు శనివారం పలాస, నరసన్నపేట, పాతపట్నంలో లోక్ అదాలత్ నిర్వహించారు. పలు కేసులను పరిష్కరించారు. ఆ వివరాలిలా ఉన్నాయి..

పలాసలో 247 కేసుల పరిష్కారం

పలాస,డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లతో ఎంతో ప్రయో జనం ఉంటుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. శనివారం కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. మొత్తం 247 కేసులు పరిష్కరిం చారు. వీటిలో పలాస, వజ్రపుకొత్తూరు మండలానికి సంబంధించి 159 కేసులు రాజీ చేసి వారి నుంచి రూ.7,25,800, మున్సిపల్ యాక్ట్ కేసులు 11 రాజీ చేసి వారి నుంచి రూ.25,89,943 జరిమానా వసూలు చేశారు. మనోవర్తి కేసులు రెండు, ఎన్ఐ యాక్ట్ కేసులు తొమ్మిది రాజీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు ఎన్.విశ్వేశ్వర రావు, పిండి వెంకటరావు, న్యాయవాదులు రాజా రత్నం నాయు డు, పీఎల్‌నారాయణ, కె.దేవరాజు, రవికుమార్, రవికుమార్ పట్నాయక్, గనీ, సుధా రాణి, తాండ్ర మురళి, నాగేశ్వరరావు, ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో 207..

నరసన్నపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టులో శనివారం నిర్వ హించిన మెగా లోక్ అదాలత్‌లో 207 కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి సి.హరిప్రియ అన్నారు. శనివారం మెగా లోక్‌అదాలత్‌ను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కంపోండ్ బిల్లు, చెక్ బౌన్సులకు సంబంధించి రెండు, మనోవర్తి కేసు లు-2, సివిల్ చెల్లింపు ఆరు కేసుల్లో రూ.27,26,576 చెల్లించారు. సివిల్ టైటిల్-5, సివిల్ ఈపీ-2 కేసుల్లో రూ.66,673, పేలా బార్గింగ్-68 కేసుల్లో రూ.65,110, ఎక్సైజ్‌శా ఖ 85 కేసుల్లో రూ.4,04,140, బ్యాంకు పీఎల్‌సీ 13 కేసుల్లో రూ.26,46,042 చెల్లిం పులు అయ్యేలా ఇరుపక్షాల అంగీకారం మేరకు తీర్పు ఇచ్చారు. ఏపీపీ సంతోషి, ఏజీ పీ గొండు సత్యనారాయణ, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో 166..

పాతపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వ హించి న జాతీయ లోక్‌అదాలత్‌లో 166 కేసులు పరిష్కరించినట్లు నరసన్నపేట జూనియర్ సివిల్ న్యాయాధి కారి, పాతపట్నం (ఎఫ్ఏసీ) హరిప్రియ తెలిపారు. వీటిలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి 98, కాంపౌండ బుల్ క్రిమినల్ కేసులు 17, భూ తగాదాలు-3, మిగిలినవి డ్రంక్ ఎండ్ డ్రైవ్ కేసులు రాజీ పరిచినట్లు తెలి పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఫరీద్ పేట గ్రామ సరిహద్దులో పేకాట ఆడుతున్న వివిధ ప్రాంతాలకు చెందిన 13 మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.95,750 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

పోలాకి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మం డల పరిధిలోని జడూరు జాతీయ రహదారి వద్ద వ్యభిచారం నడుపుతున్న ఓ గృహంపై శ నివారం పోలాకి పోలీసులు దాడి చేశారు. ఇ రువురు నిర్వాహకులను, ఒక మహిళ, ఒక వి టుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకు లను, విటుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రంజి త్ తెలిపారు.

'తప్పుడు ఫిర్యాదులు చేస్తే సహించేది లేదు'

మెళియాపుట్టి, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): పాతపట్నం ఐసీడీఎస్ సీడీపీవోపై తప్పుడు ఫిర్యాదులు చేసిన వారు బయటకు రావాలని, భవిష్యత్‌లో ఇలా చేస్తే సహించేది లేదని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు సం ఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో కోరరు. గత కొంతకాలంగా కావాలనే కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. తమను ఎవరూ డబ్బులు అడగడం లేదని, అయితే మా పేరుతో ఆకాశరామన్న పేరుతో సీఎంవోకి ఫిర్యాదులు చేయడం మంచిదికాదన్నారు. ఇప్పుడు అధికారులు వేధింపులు లేవని, మా పేరుతో కొందరు డబ్బులు దండుకునేందుకు ఇటువంటి ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఇక పై తప్పుడు ఫిర్యాదులు చేస్తే సహించేదిలే దన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సంఘ నేతలు లలితమ్మ, రేణుక, భాగ్యం, పూర్ణిమాదేవి, యోగేశ్వరి, జీవరత్నం, హరిప్రియ తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

పలాసరూరల్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): గ్రామాభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న శిలాఫలకాలపై ప్రజా ప్రతినిధుల పేర్లు వేయ డం లేదని, కనీసం విలువ ఇవ్వకపోతే ఎలా అని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశా రు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మంది రంలో శనివారం మండల సర్వసభ్య సమా వేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రజా ప్రతినిధులైన బొడ్డపాడు, అమల కుడియా సర్పంచ్‌లు తామాడ మదన్, కె.శిరీష చినం చల ఎంపీటీసీ సభ్యుడు దుర్యోధన మాట్లాడు తూ.. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఇలా అయితే పోరాటం చేస్తామన్నారు. కాగా నీటి సంఘం ఎన్నికలు కావడంతో పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాలేదు. సమా వేశంలో ఎంపీడీవో ఎస్.వసంత్‌కుమార్, తహ సీల్దార్ కల్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీ రామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయం ఆనందకరం: కలమట



మాతలలో విజయ సంకేతం చూపుతున్న కలమట

కొత్తూరు, డిశంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి సం ఘాల ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ మద్దతు దారులు విజయ దుందుభి మోగించారని, చాలా ఆనందంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. శనివారం ఎన్నికైన సంఘాల అధ్యక్షులు, సభ్యులను ఆయన అభినందించారు. ఈ గెలుపునకు సహకరించిన ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

'సాగునీటి' విజేతలకు ఎమ్మెల్యే అభినందన



నరసన్నపేట, పోలాకి మండలాల నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నరసన్నపే ట, పోలాకి మండలాల్లో 12 సాగునీటి సంఘాలకు ఎన్నికై న అధ్య క్షులు, సభ్యులను శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. నర సన్నపేట, పోలాకి మండలాల్లో విజయం సాధించిన వారికి సత్కరించి అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన జూనియర్ కళాశాల బోటనీ అధ్యాపకు డు ఆరంగి అప్పన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యాభివృద్ధికి మరింత కృషి ఎమ్మెల్యే సూచించారు.

బూర్జ నీటి సంఘం చైర్మన్‌గా వేపారి తవిటమ్మ

నరుబుజ్జిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బూర్జ నీటి సంఘంలో చైర్మన్‌గా వేపారి తవిటమ్మ, వైస్ చైర్మన్‌గా బొల్లు సూరిబాబు, డైరెక్టర్లుగా రాధాచరణ్‌చౌదరి, గంగు రామారావు, లింగిపిల్లి అప్పలసూర్యనారాయణ, గొల్వే సూర పు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నేతలు అభినందించారు.



పొందూరు: పెనుబర్తి నీటి సంఘం అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



బూర్జ నీటి సంఘం ఎన్నికల్లో చైర్మన్‌గా ఎన్నికైన వేపారి తవిటమ్మ, వైస్ చైర్మన్ బొల్లు సూరిబాబు

అండర్ పాసేజ్ లేక అవస్థలు

హరిపురం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): హరిపురం- మందస మార్గంలో బాలిగాం రైల్వే గేటు వద్ద నిత్యం వాహ నాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఏమాత్రం గేటు వేసినా కనీసం గంటసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో అండర్ పాసేజ్ నిర్మిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ఇక్కడ ఒక సారి గేటు పడితే కనీసం మూడు రైళ్లు వస్తే గానీ గేటు తీసే పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతు న్నారు. రైలు వస్తే అర గంటకు ముందే గేటు వేసి.. ప్రయాణికు లు, వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు, రైల్వే సిబ్బం దితో ఘర్షణలు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మంద స రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఈ గేటు ఉండటంతో ఇక్క డకు వచ్చిన రైలు ఆపి మళ్లీ తీసే వరకు గేటు తెరవని దుస్థితి నెలకొంది. ఈ విషయమై రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు గేటు వద్ద లైన్‌పనులు జరుగు తుండడంతో మరికొంత సమయం వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



బాలిగాం వద్ద రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

న్యూస్ బాక్స్

సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ రేపు

టెక్కలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉద యం 9 గంటల నుంచి సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి వివిధ అంశా ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చింతాడ లక్ష్మీబాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'లోకలై జేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అనే అంశంపై ఈ శిక్షణా తరగతులు నిర్వ హిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు.

- నందిగాం, డిసెంబరు 14(ఆంధ్ర జ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శిక్షణా తేదీల్లో నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని కోరారు.
- పాతపట్నం, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నుంచి పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో పి.చంద్రకుమారి ఒక ప్రక టనలో తెలిపారు. 'సుస్థిర పాలన-అభివృద్ధి లక్ష్యాల'పై సోమవారం నుంచి 19వ తేదీ వరకు బ్యాచ్‌ల వారీగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తు న్నామని, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

మృతుడి కుటుంబానికి మైటీ 'హెల్పింగ్'

వజ్రపుకొత్తూరు. డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): కొండవూరు గ్రామానికి చెందిన పాపారావు ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. ఆయ న కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బం దు లు పడుతున్న విషయం తెలుసుకుని మైటీ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం రూ. 12,500 సాయం అందించారు. కార్యక్రమం లో సంఘం అధ్యక్షుడు రాకేష్, కో-ఆర్డి నేటర్లు రాజేష్, ఆశీష్ పాల్గొన్నారు.

కోటిపల్లిలో నాలుగు పూరిళ్లు దగ్ధం

పొందూరు, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోటిపల్లిలో శనివా రం నాలుగు పూరిళ్లు పూర్తిగా దగ్ధమ య్యా యి. బాధితుల కథనం మేరకు.. పల్ల సన్యా సమ్మ ఇంట్లో ఉదయం 8.50 గంటల సమ యంలో గ్యాస్ లీకవడంతో మంటలు చెల రేగాయి. మంటలు పక్కనే ఉన్న పూరిళ్ల కు కూడా వ్యాపించాయి. గ్రామ స్థులు, యువ కులు మంటలు ఆర్పేందుకు ప్రయ త్నిం చారు. గ్రామస్థుడు అన్నం నాయుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజే యడంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే పల్ల సన్యాసమ్మ ఇంటితో పాటు పల్ల లక్ష్మి, పల్ల అశిరి నాయుడు, పల్ల మంగమ్మ పూరిళ్లతో పాటు ఇంటిలోని సామగ్రి అంతా బూడి దయ్యాయి. సుమారు రూ.ఆరు లక్షల విలు వైన నగదు, ఆభరణాలు కాలిపోయాయి. బాధితులను ఎమ్మెల్యే రవికుమార్ పరామ ర్శించి పక్కాగృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ధర్మవరంలో వరి కుప్పలు..

ఎచ్చెర్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో పొలాల్లో కొత్తపల్లి సూర్యనారా యణ, రామారావుకు చెందిన వరి కుప్పలు శనివారం దగ్ధ మయ్యాయి. సుమారు లక్ష నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బం ది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. చేతికి అందిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఈ ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలియరాలేదు.

మేధాశక్తిని పెంచేది పుస్తక పఠనమే

టెక్కలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరంతరం రకరకాల పుస్తకాలు చదవడం ద్వారా మేధాశక్తిని పెంచుకోవచ్చని సీఐ అంబటి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం అంబేడ్కర్ కూడలిలో విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ప్రారంభించారు. యడ్ల గోపి, యుగంధర్, టి.సూర్యం, పాల్గొన్నారు.